క్లుప్తంగా

నేడు పలు అభివృద్ధి పనుల ప్రారంభం

పోలవరం రూరల్: పోలవరం మండలంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి శుక్రవారం పర్యటించి పలు ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎల్ఎన్డీపేట గ్రామంలోని ఆసుపత్రిలో అదనపు భవనం శంకుస్థాపన, కొంద్రుకోటలో సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, షాపింగ్ కాంప్లెక్స్, పశువైద్య కేంద్రం, కమ్యూనిటీ హాల్, జిల్లెళ్లగూడెంలో సచివాలయం, ప్రగడపల్లిలో సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం, చేగొండిపల్లిలో రైతు భరోసా కేంద్రం, వింజరంలో రైతు భరోసా కేంద్రం, పోలవరంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయం, హెల్త్‌క్లినిక్‌లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఎంఈవోగా సురేష్‌బాబు బాధ్యతల స్వీకరణ



ఎంపీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంఈవో-1 సురేష్‌బాబు

పోలవరం రూరల్: పోలవరం మండల విద్యాశాఖాధికారి-1గా జె.సురేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విద్యాశాఖ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేస్తానని సురేష్‌బాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభం ప్రతిష్ఠ సందర్భంగా యంత్ర స్థాపన చేస్తున్న దృశ్యం

టి.నరసాపురం: స్థానిక కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 35.7 అడుగుల ఏక శిల స్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఐదు నాయనార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అనంతరం పూర్ణాహుతి జరిపారు. వేలాదిమంది భక్తులకు అఖండ అన్న సమారాధన చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు.


సీనియర్ పాత్రికేయులు నాగకుమార్ ఆకస్మిక మృతి

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్, ఏపీయూడబ్ల్యూజే ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్వీ నాగకుమార్ (54) ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు ఫ్రీ లాన్సర్ అక్రెడిటేషన్ మంజూరు కాగా బుధవారం ఆయన తీసుకోవడానికి విజయవాడ వెళ్లారు. విజయవాడ బస్‌కాంప్లెక్స్‌లో మరుగుదొడ్డికి వెళ్లి అక్కడ పడిపోయి మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం జంగారెడ్డిగూడెంలో ఆయన భౌతిక కాయానికి పలువురు యూనియన్ నాయకులు నివాళులర్పించారు.

ఎమ్మెల్యే బాలరాజు సంతాపం

బుట్టాయగూడెం: సీనియర్ పాత్రికేయులు ఎల్వీ నాగకుమార్ మృతిపట్ల ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సంతాపం తెలిపారు. నాగకుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆరేటి సత్యనారాయణ, అల్లు రత్నాజీరావు, గొగ్గులోతు మోహన్‌రావు సంతాపాన్ని తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థికి రజతం



వెయిట్ లిఫ్టింగ్‌లో సిల్వర్ మెడల్ని అందుకుంటున్న ఫణి వర్షిత్

కొయ్యలగూడెం: ఇంటర్ కాలేజ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొయ్యలగూడేనికి చెందిన విద్యార్థి ఫణి వర్షిత్ సిల్వర్ మెడల్ సాధించాడు. విద్యార్థి తల్లి, కన్నాపురం అటవీశాఖ అధికారి కె.కృష్ణకుమారి ఈ మేరకు వివరాలను గురువారం వెల్లడించారు. కాకినాడ ఆదికవి నన్నయ యూనివర్సిటీ బుధవారం నిర్వహించిన పోటీల్లో ఫణి వర్షిత్ పాల్గొని 285 కేజీల వెయిట్ లిఫ్టింగ్ విభాగంలో సిల్వర్ మెడల్ అందుకున్నట్లు తెలిపారు. విద్యార్థికి శిక్షణ ఇచ్చిన మెంటార్, ట్రైనీలను పలువురు అభినందించారు.

ప్రజల సంక్షేమం కోసమే.. వలంటీర్ వ్యవస్థ

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- జీలుగుమిల్లిలో 'వలంటీర్లకు వందనం'



వలంటీర్లను సత్కరించిన ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజ్యలక్ష్మి

జీలుగుమిల్లి (బుట్టాయగూడెం): దేశానికి జవానుల రక్షణ ఎంత అవసరమో ప్రజలకు సంక్షేమం అందించేందుకు వలంటీర్లు అంతే అవసరమని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు స్పష్టం చేశారు. గురువారం జీలుగుమిల్లిలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలరాజు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోలవరం ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. కరోనా కష్టకాలంలో వలంటీర్లు సైనికుల్లా పనిచేసి ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేశారని గుర్తు చేశారు. వలంటీర్ వ్యవస్థ వలన ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారని, వారి సేవలను కొనియాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వారిని గౌరవిస్తూ అవార్డులతో సత్కరించాలని నిర్ణయించి రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లకు వందనం కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా వలంటీర్లను సత్కరించారు.

అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం

తాటియాకులగూడెం, జీలుగుమిల్లి, పి.రాజవరం గ్రామాల్లో సిమెంట్ రోడ్లను, సుమారు రూ.44 లక్షలతో నిర్మించిన రెండు గోదాములను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి సంయుక్తంగా ప్రారంభించారు. పార్టీ మండల కన్వీనర్ సందా ప్రసాద్, సొసైటీ చైర్మన్ బోదా శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కొర్సా పోచమ్మ, సర్పంచ్ చిర్రి జగదాంబ, నాయకులు కొప్పుల సత్యనారాయణ, బూరుగు ప్రేమ్‌కుమార్, కక్కిరాల చక్రి, కక్కిరాల రాము, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో మంగతాయారు, ఎస్సై చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు బొర్రంపాలెం విద్యార్థులు



విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

టి.నరసాపురం: మండలంలోని బొర్రంపాలెం జెడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు ఏలూరులో జరిగిన ఈఎండీపీ (ఎంట్రప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) పోటీ పరీక్షలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. గైడ్ ఉపాధ్యాయురాలు జి.దీపా ఈశ్వరి మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉండే సృజనాత్మకత ఆలోచనలు వెలికితీసి వారిని భవిష్యత్‌లో గొప్ప వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈఎండీపీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ పోటీ పరీక్షలో విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారని, రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులు డీఈవో అబ్రహం, ఏపీ ఈఎండీపీ జిల్లా మేనేజర్ ఎం.వెంకటరమణ చేతుల మీదుగా బహుమతి అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినూత్న, శాలిని, మల్లికా, మౌళిక, మేఘన, శిక్షణ ఇచ్చిన జి.దీపా ఈశ్వరిదేవిని పలువురు అభినందించారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయండి



పరింపూడి సచివాలయంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న ఆర్డీవో అద్దయ్య

కొయ్యలగూడెం: అర్హులైన ప్రతి ఒక్కరికీ నవరత్న పథకాల్లో భాగంగా ఇళ్ల మంజూరు లక్ష్యంగా పని చేయాలని ఆర్డీవో అద్దయ్య పేర్కొన్నారు. గురువారం పరింపూడి, యర్రంపేట-2 (ఈవిడిపాలెం)లలో నవరత్న పథకాల ఇళ్ల మంజూరుకు సంబంధించి సచివాలయాల్లోని రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఇళ్ల మంజూరు 92 శాతం ఉందని.. దీనిని నూటికి నూరు శాతం అయ్యేలా కృషి చేయాలని తహసీల్దార్ సూచించారు. ఆర్ఐ కె.మణి దివ్య, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం



లక్కవరంలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇళ్ల స్థలాల పంపిణీ, గృహాలను మంజూరు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. మండలంలోని లక్కవరంలో లబ్ధిదారులకు జగనన్న గృహాల పట్టాలను పంపిణీ చేశారు. ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి సొంతింటి కల నెరవేర్చిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి, సొసైటీ చైర్మన్ దల్లి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు చిల్ల దుర్గారెడ్డి, పంచాయతీ కార్యదర్శి పగడం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

6 నుంచి పొగాకు వేలం ప్రారంభం

జంగారెడ్డిగూడెం: ఎస్ఎల్ఎస్ పరిధిలో వర్జీనియా వేలాన్ని ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు జంగారెడ్డిగూడెం 1వ వేలం కేంద్రం అధికారి బి.శ్రీహరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 14వ తేదీ నుంచి వేలం ప్రారంభం కావాల్సి ఉండగా, రైతులు వేలం తేదీని మార్పు చేయాలని పొగాకు బోర్డుకు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, ఈడీ ఎ.శ్రీధర్‌బాబులు వేలం తేదీని మార్పు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో మార్చి 6వ తేదీ నుంచి వేలం ప్రక్రియ ప్రారంభమవుతుందని, కావున రైతులు బేళ్లను అమ్మకానికి సిద్ధం చేసుకోవాలని శ్రీహరి సూచించారు.

బిషప్ జయరావుకు సత్కారం



బిషప్ జయరావును సత్కరిస్తున్న దళిత జేఏసీ నాయకులు

ఏలూరు (టూటౌన్): విశాఖ పట్టణంలోని విశాఖ అపోస్తుల అడ్మినిస్ట్రేటివ్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన ఏలూరు పీఠాధిపతి రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేరను శుక్రవారం జాతీయ దళిత జేఏసీ చైర్మన్ పెరికె వరప్రసాదరావు ఆధ్వర్యంలో దళిత జేఏసీ నాయకులు ఘనంగా సత్కరించారు. విశాఖ పట్టణంలోని జ్ఞానపురం కేథడ్రల్ చర్చిలో జయరావును గజమాలతో సన్మానించారు.

కొల్లేరు గ్రామాల్లో జగన్‌తోనే అభివృద్ధి



రూ.1కోటీ 90 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌తో పాటు మైక్రో ఫిల్టర్‌బెడ్లు వద్ద ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



రూ.40 లక్షలతో పూర్తి చేసిన మానూరు సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

ఏలూరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. గురువారం ఆయన ఏలూరు రూరల్ గ్రామాల్లో రూ.2.43 కోట్లతో పూర్తిచేసిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. మహేశ్వరపురం వద్ద రూ.1.90 కోట్లతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్‌తో పాటు మైక్రో ఫిల్టర్ బెడ్లు, రూ.40 లక్షలతో పూర్తి చేసిన మానూరు సీసీ రోడ్డు, రూ.7 లక్షలతో కల్వర్ట్, మరో 6 లక్షలతో ఏర్పాటుచేసిన తాగునీరు బోరును ఎమ్మెల్యే ప్రారంభించారు. స్థానికులు రూ.30 లక్షలతో చేపట్టిన కల్యాణ మండపం పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పెదయాగనమిల్లిలో రూ.38 లక్షలతో పూర్తిచేసిన సచివాలయం, రూ.21లక్షలతో నిర్మించిన వైఎస్ఆర్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ హయాంలో సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పెద్ద ఎత్తున చేపట్టామని చెప్పారు. టీడీపీ హయాంలో కొల్లేరు గ్రామాల్లో అభివృద్ధి జాడే లేదని విమర్శించారు. నేడు కొల్లేరులోని ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు మౌలిక వసతులు కల్పించడంతో పాటు సచివాలయం, వైఎస్ఆర్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని వివరించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు రెండోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, జెడ్పీటీసీ మండల సరస్వతి, రాష్ట్ర వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, డైరెక్టర్ మండల కొండలరావు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, శ్రీపర్రు సర్పంచ్ సైదు భాగ్యలక్ష్మి, సైదు వజ్రం, పెదయాగనమిల్లి సర్పంచ్ బలే నాగసులోచన, ఉపసర్పంచ్ సైదు విజయలక్ష్మి, బలే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



ఆలయ ఈవో ఆకుల కొండలరావుకు విరాళాన్ని అందజేస్తున్న చిన్ని రామ సత్యనారాయణ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీసీతారామ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ (సీహెచ్ఆర్) గురువారం విరాళం అందజేశారు. సీహెచ్ఆర్ రూ.1,01,116 ఆలయ ఈవో ఆకుల కొండలరావుకు అందజేయగా ఆయన రశీదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీహెచ్ఆర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు.

జూపూడిపై బురద చల్లడం తగదు

ఏలూరు (టూటౌన్): ప్రభుత్వ సలహాదారుడు జూపూడి ప్రభాకరరావుపై ఇటీవల కొందరు నాయకులు పనిగట్టుకుని బురద చల్లే ప్రయత్నం చేయడం తగదని రిటైర్డ్ ఏఎస్పీ పాకా ప్రభాకరరావు, ఆంధ్రప్రదేశ్ క్రైస్తవ ప్రతినిధి పులిదిండి జాన్ స్కాండీలు అన్నారు. శుక్రవారం వారు విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకు వినియోగించుకున్నప్పుడు మాట్లాడని గొంతుకలు జూపూడి ప్రభాకర్ విషయంలో పనిగట్టుకుని విషం చిమ్మడం తగదని హితవు పలికారు. ఒకరిపై ఒకరు విమర్శించుకోవడం మాని బహుజన రాజ్య స్థాపన దిశగా పయనించాల్సిన అవసరం ఉందని వారు వివరించారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

భీమడోలు: ఇంటర్ పరీక్షలు శుక్రవారం ప్రారంభం కానుండటంతో పగడ్బందీగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మార్చి ఒకటో తేదీ శుక్రవారం నుంచి 20వ తేదీ వరకు జూనియర్, సీనియర్ ఇంటర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు పరీక్షలు నిర్వహించనున్నారు. అరగంట ముందే కేంద్రానికి వెళ్లేందుకు అనుమతిస్తారు. ఒక్క నిమిషం అలస్యమైన పరిక్షా కేంద్రంలోకి ప్రవేశం లేదు. మాస్ కాపీయింగ్‌కు అస్కారం లేకుండా నిఘా ఏర్పాటుచేశారు. మండలంలోని భీమడోలు శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లో ఏర్పాటుచేసిన కేంద్రాల్లో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. భీమడోలు శ్రీవేంకటేశ్వర కళాశాలలో జూనియర్ ఇంటర్ 179 మంది, సీనియర్ ఇంటర్‌లో 186 మంది పరీక్షలు రాయనున్నారు. పోలసానిపల్లి గురుకుల బాలికల కళాశాలలో జూనియర్ ఇంటర్ 232 మంది, సెకండియర్ పరీక్షలకు 209 మంది రాయనున్నారు. ఈ కేంద్రాల్లో పోలసానిపల్లి, భీమడోలు, గుండుగొలను, గుణ్ణంపల్లి, ద్వారకాతిరుమలకు చెందిన కళాశాలల విద్యార్థులు పరీక్షలు రాస్తారు. ఆయా కేంద్రాల్లో ఒక్కో గదిలో 24 నుంచి 30 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. వీరికి ఒక ఇన్విజిలేటర్‌ను నియమించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేస్తారు. పరీక్షా కేంద్రాల్లో ఫ్యాన్లు, మంచినీటి సదుపాయాల వంటి మౌలిక వసతులను కల్పించారు.

3న పల్స్‌పోలియో విజయవంతం చేయండి



ప్రగడవరంలో పల్స్‌పోలియో శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఆరోగ్య విస్తరణ అధికారి

చింతలపూడి: ఈనెల 3వ తేదీన జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కె గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డా ఆర్.కృష్ణకిషోర్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ప్రగడవరం గ్రామంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పల్స్ పోలియో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాక్సినేటర్లతో నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్ మాట్లాడుతూ పల్స్‌పోలియో కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బందిని, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములు చేయాలని అన్నారు. కార్యక్రమంలో డా అబిద, ఉమామహేశ్వరరావు, రాణి ,రూట్ ఆఫీసర్స్ విష్ణుమూర్తి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ఎమ్మెల్యే ఆళ్ల నానిని కలిసిన రవికుమార్

ఏలూరు (టూటౌన్): చింతలపూడిలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని పిలుపు నిచ్చారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో చింతలపూడి నియోజకవర్గానికి చెందిన జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రవికుమార్ గురువారం ఎమ్మెల్యే నానిని మర్యాద పూర్వకంగా కలిశారు. చింతలపూడి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులు, అక్కడ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నాని దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై నాని మాట్లాడుతూ చింతలపూడిలో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆదేశించారు. పార్టీ కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారిని నడిపించేందుకు ముందుంటానని భరోసా ఇచ్చారు. అతి త్వరలోనే చింతలపూడి నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ విజయానికి తోడ్పాటు అందించాలి



రాజవరంలో మహిళలతో కలిసి పొగాకు గ్రేడింగ్ చేస్తున్న తెల్లం రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి తోడ్పాటు అందించాలని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి కోరారు. జీలుగుమిల్లి మండలం పి.రాజవరంలో పర్యటించిన ఆమె పొగాకు గ్రేడింగ్ చేసే మహిళలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో పాటు పనిచేస్తూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేసి మాటతప్పని, మడమ తిప్పని నాయకుడిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు పదవుల కోసమే తప్ప ప్రజా సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే గెలిపించాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఘనంగా దాసాంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠించిన శ్రీ దాసాంజనేయ స్వామి మూల విరాట్ విగ్రహం

కొయ్యలగూడెం: రాజవరం పంచాయతీ మంగపతిదేవిపాలెంలో శ్రీదాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. మారుతి జంక్షన్ (మూడు పుంతల) రోడ్డులో నూతనంగా పునర్నిర్మించిన ఆలయంలో ఉదయం 11.26 గంటలకు స్వామివారి విగ్రహాన్ని శాస్త్రోక్తంగా అర్చకులు ప్రతిష్ఠాపన చేశారు. ధర్మకర్తలు వాడపల్లి చిన్న రాంబాబు, నాగరాణి, లక్ష్మణరావు, కృష్ణకుమారి కుటుంబీకులు దంపతయుక్తంగా స్వామివారికి ప్రథమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సుమారు 3 వేల మందికి అన్నసమారాధన చేశారు. బ్రహ్మశ్రీ మంచిలి రామలింగేశ్వర శివాచార్యుల పర్యవేక్షణలో మూడు రోజులపాటు హోమ క్రతువులు, ఆంజనేయ స్వామి విగ్రహంతో పాటు గణపతి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు.

విద్యార్థులు వ్యాపారవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్ : విద్యార్థి దశ నుంచే వ్యాపార లక్షణాలు అలవర్చుకోవాలని ఏలూరు జిల్లా సైన్స్ అధికారి చౌదరి అన్నారు. గురువారం శనివారపుపేట జెడ్పీ పాఠశాలలో జిల్లా స్థాయి ఈఎండీపీ (వ్యవస్థాపక, మనస్తత్వ అభివృద్ధి ప్రోగ్రాం సైన్స్ ఎక్స్‌పో) నిర్వహించారు. ఈ సందర్భంగా చౌదరి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఉత్తమ వ్యాపార దక్షత లక్షణాలు అలవడతాయన్నారు. అందుకోసం పోటీ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు మొత్తంగా 106 ప్రాజెక్టులు సమర్పించారన్నారు. వీటిలో 10 ప్రాజెక్టులు ఎంపిక చేశామని, మొదటి స్థానంలో బొర్రపాలెం జెడ్పీ పాఠశాల, రెండోస్థానంలో రాచూరు పాఠశాల, మూడో స్థానంలో కేశవరం పాఠశాల విద్యార్థులు దక్కించుకున్నారని వివరించారు. ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన వారిని సర్టిఫికెట్లు అందజేశామని, ఎంపిక ప్రక్రియలో హెచ్ఎం ప్రకాష్, జయశుభ ఉన్నారని తెలిపారు. కార్యక్రమాన్ని అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ రెడ్డి రామారావు, ఈఎండీపీ జిల్లా మేనేజర్ ఎం వెంకటరమణ పరివేక్షించారు.